క్లుప్తంగా

ఈదురు గాలులకు విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



తీపర్రు–ఉసులుమర్రు గ్రామాల సరిహద్దులో ఆర్అండ్‌బీ రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం

పెరవలి: ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి చెట్లు నేలకూలాయి. అరటి తోటలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పెరవలి మండలంలో శుక్రవారం మధ్యాహ్నం వీచిన గాలులకు విద్యుత్ శాఖకు అపార నష్టం చేకూరింది. నిడదవోలు–నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో అజ్జరం, పెరవలి, కాకరపర్రు, తీపర్రు, ఉసులుమర్రు గ్రామాల వద్ద పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు ఈదురు గాలులకు నిలువునా విరిగిపడ్డాయి. అధికారులు స్పందించి వెంటనే చెట్లను తొలగించే పని చేపట్టారు. వరి చేలు నేలనంటాయి. విరిగిపడిన విద్యుత్ స్తంభాలను తొలగించారు. రాత్రికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ డేవిడ్ నిశ్చల్ తెలిపారు.

ఉండ్రాజవరం: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వాన బీభత్సం సృష్టించింది. మండలంలో తాడిపర్రు, వెలగదుర్రు, తదితర గ్రామాల్లో కొన్ని చోట్ల వరి చేలు, మామిడి చెట్లు, వేప చెట్లు నేలకొరిగాయి.

మహిళ వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

తాళ్లపూడి: అన్నదేవరపేట బీసీ కాలనీకి చెందిన మహిళ బొర్రా వీరలక్ష్మి ఇంటిపై పిడుగు పడడంతో ఆమె శరీరం కాలిపోయి ప్రాణాపాయ స్థితిలో రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం పలువురి దాతల నుంచి సేకరించిన రూ.21,500 ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేసారు. మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు వాట్సప్ ద్వారా తన మిత్రులను సాయం కోరగా పలువురు దాతలు స్పందించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోడాల రమాదేవి, నందన ఫౌండేషన్ రవి, ఉపాధ్యాయురాలు జేడీ సునీత, గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ స్థాపకులు వరలక్ష్మి పాల్గొన్నారు.

మండల పరిషత్ పాలనాధికారిగా వీవీఎస్ చౌదరి

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సూపరింటెండెంట్‌గా వీవీఎస్ చౌదరి బాధ్యతలు స్వీకరించారు. ఆయన పరిపాలనాధికారిగా విధులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

దేవరపల్లి: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణ కేంద్రంలో 144 మంది మహిళలకు 90 రోజుల పాటు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తారన్నారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించాలి

తాళ్లపూడి(కొవ్వూరు): ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో చేపట్టే వివిధ కార్యక్రమాలు, రోగులకు అందుతున్న సేవలు తదితర విషయాలను చర్చించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, కొత్త జనరేటర్ ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యాధికారులు, టీడీపీ ఫ్లోర్ లీడర్‌సూరపనేని చిన్ని, బీజేపీ నాయకుడు పిల్లలమర్రి మురళీ కృష్ణ, పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవం

చాగల్లు: స్థానిక సెంటర్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం, స్వామిఅమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు డాక్టర్ ఆలపాటి సాంబశివరావు దంపతులు పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

వదలని వర్షం.. తరలని ధాన్యం

- రాశుల్లో, బస్తాల్లోనే ధాన్యం
- అకాల వర్షాలకు తడిసిపోతున్న ధాన్యం రాశులు
- గగ్గోలు పెడుతున్న రైతులు
- ధాన్యం కొనే నాథుడే కరువు
- రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ సేవలకు టీఏల చేతివాటం
- చోద్యం చూస్తున్న అధికారులు



ఖండవల్లిలో ఆరబెట్టిన ధాన్యం రాశులు



ఖండవల్లిలో తడిసిన ధాన్యం బస్తాలు

పెరవలి: అకాల వర్షాల వల్ల ఐదు రోజులుగా రైతుల కంటిమీద కునుకు కరువైంది. ప్రభుత్వం అరకొరగా ధాన్యం కొనుగోలు చేయడంతో ఎక్కడి ధాన్యం అక్కడే కళ్లాల్లో, రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో రాశులుగా ఉంది. రోజు విడిచి రోజు కురుస్తున్న వర్షాల వలన ఎక్కడి ధాన్యం అక్కడే కదలకుండా ఉంది. ఒబ్బిడి చేసిన ధాన్యం తరలించేందుకు సన్నాహాలు చేస్తే మిల్లర్లు అనేక వంకలు పెట్టి ధాన్యం దిగుమతికి నిరాకరించడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పెరవలి మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. పెరవలి మండలంలో 8 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా 80 శాతం కోతలు పూర్తయినా ఎక్కడి ధాన్యం అక్కడే ఉంది. ఉదయం ఎండ కనిపించడంతో రైతులు ధాన్యం ఆరబెట్టడం, హఠాత్తుగా అకాల వర్షం కురవడంతో ధాన్యం తడిచిపోవటం పరిపాటిగా మారింది. దీనితో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి మిల్లులకు తరలించే పరిస్థితి లేకుండాపోయింది. ధాన్యం రాశులు, బస్తాలను రక్షించుకునేందుకు ఎంత జాగ్రత్తగా బరకాలు, బరకాలతో కప్పి ఉంచినా వర్షానికి తడిచిపోవడంతో మొలకలు వస్తాయనే భయం రైతులను వెంటాడుతోంది.

కళ్లాల్లోనే ధాన్యం రాశులు

ఒకవైపు ధాన్యం విక్రయించేందుకు రైతులు నానా పాట్లు పడుతుంటే పదిరోజుల్లో 4 సార్లు కురిసిన వర్షాలకు ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. దీనితో తడిచిన ధాన్యం ఆరబెట్టటం, సాయంత్రం నిల్ల చేయడం రైతులకు దినచర్యగా మారింది.

నియోజకవర్గంలో ధాన్యం నిల్వలు

నిడదవోలు నియోజకవర్గంలో ధాన్యం పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశుల్లో, బస్తాల్లో ఉంది. ఈ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న ఆశతో రైతులు ఎదురుచూస్తూ అధికారులు, రైతు సేవా కేంద్రాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. పెరవలి మండలంలో 7 వేల మెట్రిక్ టన్నులు, ఉండ్రాజవరం మండలంలో 8 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి.

చేతి వాటం ప్రదర్శిస్తున్న టీఏలు

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ల చేతులు తడపాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పెరవలి మండలం కానూరు ఆర్ఎస్‌కేలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. ధాన్యం తరలించేందుకు ఆన్‌లైన్ చేసేందుకు వెళుతుంటే టీఏలకు రూ.500 చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి రైతులు తీసుకువెళ్లడంతో వారు విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. అసలే ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు రాత్రీ పగలూ తేడా లేకుండా ధాన్యం రాశుల చుట్టూ పడిగాపులు పడాల్సి వస్తోంది. రైతు సేవా కేంద్రాల్లోని టీఏలు అక్రమ వసూళ్లతో రైతన్నలు అల్లాడిపోతున్నారు.

కొనుగోలుకు రాని అనుమతులు

ధాన్యం కొనుగోలుకు ఇంకా అనుమతులు రాకపోడంతో రైతులు ఆర్ఎస్‌కే, ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు అనుమతులు వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తామని రైతులకు సర్దిచెప్పడంతో ఉసూరుమంటూ రైతులు తిరిగి వెళ్లిపోతున్నారు. 500, లేక 600 టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతులు వస్తున్నాయని, అరగంటలోనే టార్గెట్ పూర్తవ్వడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రైతులు గోడును పట్టించుకోరా?



ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లుల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. అధికారుల వద్దకు వెళుతుంటే అనుమతులు వస్తాయి అంటున్నారు. రైతులు గోడును పట్టించుకునే వారే కరువయ్యారు. పంట పండించటమే రైతులు చేసిన నేరంలా ఉంది. ఇదే విధానం కొనసాగితే పంటలు సాగు చేసేవారు ఉండరు.

– చిట్టీడి సత్యనారాయణ, రైతు, పెరవలి

టార్గెట్ పూర్తయ్యిందంటున్నారు



రోజూ వర్షం భయపెడుతోంది. ధాన్యం రాశుల్లో ఉంది. రైతు సేవా కేంద్రాలకు వెళుతుంటే ధాన్యం కొనుగోలుకు అనుమతులు లేవంటున్నారు. అనుమతులు వచ్చిన తరువాత వెళ్లిన ప్రతి సారి టార్గెట్ పూర్తయ్యిందని చెబుతున్నారు. ఏమి చెయ్యాలో పాలుపోవడం లేదు.

– అధికారి పల్లపురాజు, రైతు, కానూరు అగ్రహారం

ధాన్యం కొనుగోలును వేగవంతం చేస్తాం



పెరవలి మండలం పరిధిలో శుక్రవారం 1000 టన్నుల ధాన్యం కొనుగోలు చేయటానికి అనుమతించారు. మరో 4 వేల టన్నులకు అనుమతులు రావలసి ఉంది. వీటికి కూడ అనుమతులు వస్తే నూరుశాతం ధాన్యం కొనుగోలు పూర్తవుతుంది. ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– మేరీ కిరణ్, వ్యవసాయాధికారిణి, పెరవలి

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, తానేటి వనిత

నల్లజర్ల: జెడ్పీటీసీ సభ్యులు ముప్పిడి లక్ష్మి, వెంకటరత్నం దంపతుల కుమారుడు మణిరత్నానికి, సత్య శ్యామలకు వివాహం జరిగింది. నూతన దంపతులను వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు పోతవరంలో శుక్రవారం ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ మంత్రి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు పాపా నాగేశ్వరావు, చిడిపి చింతయ్య, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాలి వేణు, గన్నమని జనార్ధనరావు, బంక అప్పారావు, నక్కా పండు, పిచ్చుకుల ప్రసాద్, మండల మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు కృషి

తాళ్లపూడి(కొవ్వూరు): గ్రంథాలయాల డిజిటలైజేషన్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్ర ప్రసాద్ అందించిన నిధులతో నిర్మిస్తున్న రిఫరెన్సు విభాగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జీవీవీఎస్ త్రినాథ్ పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో డ్రైనేజీల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి. వేదికపై ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: మండల కేంద్రమైన దేవరపల్లిలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీలను త్వరలో రూ.4 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో పారిశుధ్య పనుల్లో పారదర్శకత లేదని, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు, చెత్త కుప్పలు ఉన్నాయని అన్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. 20 వేల జనాభా ఉన్న దేవరపల్లిలో ప్రజలకు సరైన ప్రభుత్వ ఆసుపత్రి లేదని, సీఎస్ఆర్ నిధులు రూ.70 లక్షలతో పీహెచ్‌సీలో భవనం నిర్మిస్తామని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకూ 16,627 మెట్రిక్ టన్నుల రబీ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మరో 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి తీసుకువచ్చామని తెలిపారు. ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ, గౌరీపట్నం, దుద్దుకూరు, లక్ష్మీపురం, బందపురం, కొండగూడెం గ్రామాల్లో ఉన్న సుమారు 80 నల్లరాతి క్వారీల ద్వారా మండల పరిషత్‌కు మైనింగ్ సెస్ ఎక్కువగా వచ్చేదని, 50 శాతం ఆదాయం మైనింగ్ ద్వారా వచ్చేదని వివరించారు. నాలుగేళ్లుగా క్వారీల్లో బొగ్గు పడటం వల్ల మెటల్ వ్యాపారం తగ్గి, ఆదాయం రావడం లేదని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద పిల్లలకు ఇవ్వాల్సిన 25 శాతం సీట్లు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఉచితంగా సీట్లు ఇచ్చి, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు పంచాయతీల్లో అదనపు మోటార్ల కొనుగోలుకు రూ.22.50 లక్షలు మంజూరు చేశామన్నారు. మూడు మంచినీటి బోర్లకు నిధులు మంజూరు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో 3.64 లక్షలకు గాను 2.16 లక్షల పనిదినాలు సాధించామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల పనిదినాలు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 49 వేలు పూర్తి చేశామన్నారు. రోజుకు రూ.307 వేతనం చెల్లిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవన, గ్రామీణ మంచినీటి సరఫరా, పంచాయతీరాజ్, విద్యుత్, విద్య, వైద్య, ఆరోగ్యం, రెవెన్యూ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వనితపై దుష్ప్రచారం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం

నల్లజర్ల: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనితపై దుష్ప్రచారం తగదని ఆ పార్టీ నల్లజర్ల మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఇంటి వద్ద జరిగిన వైఎస్సార్ సీపీ మండల సమావేశం వనితపై ఒక టీవీ చానల్ ప్రసారం చేసిన కథనాన్ని తీవ్రంగా ఖండించింది. వెల్లంకి మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని, కొంత మంది కుహనా నాయకులు వెనుక ఉండి పార్టీని భ్రష్టు పట్టించడానికి కుతంత్రాలు పన్నుతున్నారని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో వనిత పార్టీ శ్రేణులకు నిస్వార్థంగా సేవలందిస్తున్నారని, ఏ కష్టమొచ్చినా వెంటనే స్పందించి, తగు చర్యలు చేపడుతున్నారని అన్నారు. తమలో గ్రూపులు లేవని, ఉన్నది జగనన్న గ్రూపు ఒక్కటేనని అన్నారు. వనిత ప్రతిష్టను దెబ్బ తీయడానికి కొంత మంది కుట్రలు పన్ని బురద చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కా పండు, కార్మిక విభాగం అధ్యక్షుడు మద్దూరి నాగేశ్వరరావు, వామిశెట్టి పరమేశ్వరావు మాట్లాడుతూ, సామాజిక న్యాయంలో భాగంగా కాపు సామాజిక వర్గానికి వనిత పెద్ద పీట వేసి, ఉన్నత పదవులు ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బంక అప్పారావు, మండల మహిళా అధ్యక్షురాలు యజ్జవరపు లక్ష్మి, డాక్టర్ అల్లూరి సూర్యచంద్రరావు, బళ్ళ నాని, అచ్యుత వెంకటస్వామి, తోట వెంకట్రావు, సయ్యద్ మునాఫ్, కలం సత్యనారాయణ, లీగల్ సెల్ అధ్యక్షుడు గోగల మండ బాబ్జీ, బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నీ నాగూ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పెనుమాక వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వలీబాషా కుటుంబానికి రక్షణ కల్పించాలి



తహసీల్దారు నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ మొహమ్మద్ ఆరిఫ్, ముస్లింలు

నిడదవోలు: పోక్సో కేసులో రాజీకి రానందున బాధితురాలి తండ్రి వంట మాస్టర్ వలీబాషాను అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితుడు సిరంగుల అనిల్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.25 లక్షల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో శుక్రవారం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ, ఇతర ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. పట్టణంలో పెద్ద మసీదు సెంటర్‌లో ఫ్లకార్డులను ప్రదర్శించి ధర్నా చేపట్టారు. నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, తహసీల్దారు నాగరాజునాయక్‌ను మసీదు వద్దకు పిలిపించి మైనార్టీ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ ఆందోళనకారుల సమక్షంలోనే చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ వలీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితుడి కుటుంబానికి పోలీసు శాఖ రక్షణ కల్పించాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి హత్య కేసు, పోక్సో కేసును ఒకేసారి విచారించి నిందితుడు అనిల్‌కుమార్‌కు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. నిడదవోలు సీఐ, తహసీల్దార్లు మాట్లాడుతూ నిందితుడికి కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తామని, వలీ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ముస్లింలు ఆందోళన విరమించారు. సయ్యద్ జానీ, షుజాద్ అహ్మద్, షాద్ అహ్మద్, ఖాదిరి షేక్ అఖిబ్, ఫరూఖ్, ఇమారాన్, అజ్మల్, షేక్ ఖాజా, ఎండీ రఫీ పాల్గొన్నారు.

అండగా ఉంటాం

వలీబాషా హత్యకు గురై మృతిచెందడం అత్యంత బాధాకరమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. వలీ కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. వలీ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన అన్నారు.


యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం



మెగాజాబ్ మేళాను ప్రారంభిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు : రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వికాస జేకేసీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో ఐటీ రంగానికి చెందిన కంపెనీలు అధికంగా వచ్చాయని, తదుపరి విడతలో నిర్వహించే జాబ్ మేళాలో టూరిజం, అతిథ్య రంగాలకు సంబంధించిన కంపెనీలను ఆహ్వానిస్తామన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్ టూరిజం కోర్సులు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. మెగా జాబ్ మేళాలో నియోజకవర్గం వ్యాప్తంగా 2,386 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వివిధ కంపెనీల ద్వారా 1,038 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఆయన ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వికాస పీడీ కె.లచ్చారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జీవీడీ మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సింగిల్ టెండర్లపై సభ్యుల నిలదీత



మాట్లాడుతున్న చైర్మన్ ఆదినారాయణ


కౌన్సిల్ సమావేశంలో సభ్యుడి నిలదీత

నిడదవోలు: పట్టణంలో చేపడుతున్న పలు పనులపై సింగిల్ టెండర్లు వేయడంపై ఆంతర్యమేమిటని, కాంట్రాక్టర్లు దొరకడం లేదా అంటూ కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 14 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. ఆస్తి, నీటి పన్నుల రూపేణా రూ.5.88 కోట్ల పన్నులు వసూలు చేసిన అధికారులను చైర్మన్ అభినందించారు. కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, పట్టణంలో కొన్ని పనులకు చాలా తక్కువ శాతానికి సింగిల్ టెండర్లు దాఖలు చేస్తున్నారన్నారు. దీనిపై కమిషనర్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ, అత్యవసర పనులకు సింగిల్ టెండర్లను ఆమోదిస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు మాట్లాడుతూ, పట్టణంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య వాహనాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి రాజీనామా చేసిన అంశాన్ని కౌన్సిల్ ఆమోదించింది.

సత్కారం

పన్నుల వసూళ్లలో విశేష కృషి చేసిన కమిషనర్ కృష్ణవేణి, మున్సిపల్ రెవెన్యూ అధికారి ఎం.నాగకుమారి, ఆర్ఐ సీహెచ్ వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ టి.సునీతతో పాటు, ముంబైలో జరిగిన రాష్ట్ర వెటరన్ డెఫ్ క్రికెట్ టోర్నీలో మూడో స్థానం సాధించిన పబ్లిక్ హెల్త్‌వర్కర్ ఎస్‌వీవీ శివకుమార్‌ను కౌన్సిల్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు.

కన్నుల పండువగా స్వామివార్ల కల్యాణోత్సవాలు




అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు రెండవ రోజు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వైశాఖమాసం శుక్రవారం వందలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. చిన్న పిల్లలకు ఉచితంగా పాలు, దాతల సహకారంతో ఉచిత ప్రసాదం చక్కెర పొంగళి, లడ్డూ పంపిణీ చేశారు. వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించేందుకు క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులందరికీ ఉదయం, సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. శుక్రవారం నాలుగువేల మంది స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు.

అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం


నిత్య కల్యాణ శ్రీనివాసుడికి అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లకు శుక్రవారం రాత్రి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. వేద మంత్రాల నడుమ నిర్వహించిన ఈ కల్యాణోత్సవాన్ని తిలకించిన భక్తులు పరవశించిపోయారు.



తాళ్లపూడిలో ఉమామహేశ్వర స్వామి రథోత్సవం

ఉమామహేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

తాళ్లపూడి: పార్వతి సమేత ఉమామహేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, రథోత్సవం శుక్రవారం తాళ్లపూడిలో ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా అర్చకులు జంధ్యాల గంగాధర శర్మ, అశ్వినీదత్ ఆధ్వర్యంలో పరస శ్రీనివాస్ దంపతులు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రథోత్సవం గ్రామంలో వైభవంగా సాగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, చిన్నారుల కోలాటం నడుమ భక్తులు ఉత్సాహంగా రథాన్ని లాగారు.



పసుపు కొడుతున్న మహిళలు

ధ్వజారోహణం.. దేవతలకు ఆహ్వానం

నల్లజర్ల: దేవదేవుని వాహనమైన గరుత్మంతుని ద్వారా దేవతలను కల్యాణోత్సవానికి ఆహ్వానించే ధ్వజారోహణ కార్యక్రమాన్ని నల్లజర్ల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వేద పండితులు శుక్రవారం ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దిపాటి చంద్రశేఖర్, ఈఓ నాగరాజు, అర్చకులు గంజాం భాస్కర రామకృష్ణ పాల్గొన్నారు. తొలుత గరుత్మంతుని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కల్యాణోత్సవానికి శుభసూచకంగా ముత్తయిదువలు పసుపు కొట్టారు.